రెడ్ బాక్స్

సుంకరి రాంప్రసాద్

"వీల్లేదు!

ఎట్టి పరిస్థితులలోనూ ఆ రెడ్ బాక్స్ ఇంగ్లండు చేర టానికి వీల్లేదు! పట్టలేని ఆవేశంతో గట్టిగా అరిచాడు శివాజీపాటిల్.

అతనివంకే చూస్తున్నారు చౌహాన్, పండిట్. సూది పడితే ఖంగుమని మ్రోగేటంత నిశ్శబ్దం రాజ్యమేలుతున్న ఆ చిన్నగదిలో ఒక్క శివాజీపాటిల్ గొంతు మాత్రం కంచులా ఖంగుమని మ్రోగుతూంది.

"తమ సంస్థానాలను నిలబెట్టుకోవడానికి, తమ జాగీర్లను ఖరారు చేసుకోవడానికి, మ్లేచ్ఛుల ఉచ్చిష్టం తినే ఈ తుచ్ఛులు ఈ నవాబులూ....

ధైర్యం విడచి, శౌర్యం మరచి గాజులు ధరించిన ఈ రాజులూ....

తరతరాలుగా, తమ వంశ ప్రతిష్టలకు ప్రతీకలుగా తమ ఖజానాల్లో భద్రపరచబడ్డ వజ్రవైఢూర్యాలను,

మణి, రత్నహారాలను.... ఈ తెల్లదొరలకు కానుకలుగా సమర్పిస్తారా? వాటిని మూటలుకట్టి ఆ దొరలు తమదేశానికి పట్టుకుపోతారా?

ఎవడబ్బ సొమ్మని?

ఎవడబ్బ సొమ్మని వీరు దారాదత్తం చేస్తారు? వారు దోచుకుపోతారు?

ఇది మన ఆస్తి! మనదేశ సంపద! శతాబ్దాలుగా భరతమాత గళసీమను అలంకరించిన అపూర్వ ఆభరణాలు అవి!

వాటిని దోచుకుపోవడానికి యెవడికైనా యెన్ని గుండెయలు?" — ఆవేశంతో ప్రళయాగ్నిలా ప్రజ్వరిల్లి పోతున్నాడు పాటిల్.

"కాని, 'ఎలిజబెత్' కాన్వో షిప్‌లో అంత కట్టుదిట్టమైన కాపలాతో తీసుకుపోబడుతున్న ఆ పెట్టెను చేజిక్కించుకోవడం యెలా?" ఆత్రంగా ప్రశ్నించాడు చౌహాన్.

"అవును! ఎలా?" అడిగాడు పండిట్.

వారిద్దరివంకా సాలోచనగా చూసి చిన్నగా తల పంకించి "ఇలా" అంటూ లోగొంతుతో ఒక అద్భుతమయిన ప్లాన్‌ను వివరించసాగాడు శివాజీపాటిల్.

వారు "క్రాంతి" విప్లవ సంఘసభ్యులు. దేశమాత దాశ్య శృంఖలాల విచ్ఛేదనకై అహర్నిశలూ శ్రమిస్తున్న ఎన్నో అజ్ఞాత విప్లవ సంఘాల్లో వారిదీ ఒకటి. తిలక్ ఉద్బోధించిన అతివాదంకన్నా గాంధీజీ అనుసరిస్తున్న మితవాదం కన్నా, బోస్, భగత్‌సింగ్‌లు యెన్నుకున్న ఉగ్రవాదమే స్వాతంత్ర్య సముపార్జనకు ఉత్తమ మార్గమని నమ్మిన విప్లవకారులు వారు.

కోట్ల రూపాయల విలువచేసే ఆ సంపదను చేజిక్కించుకోగల్గితే, దాని సాయంతో జర్మనీ నుండి ఆయుధాలను కొనుగోలు చేసి, పెద్ద విప్లవసేనను తయారుచేయాలని వారి ఆశ.

ఆ ఆశయం కోసమే ప్రాణాలను పణంగా పెట్టి మరీ, ఆ సాహసకార్యానికి సిద్ధపడుతున్నారు వారు.

2

నల్లని అరేబియా సముద్రజలాలపై రాయంచలా సాగిపోతూంది ఎలిజబెత్ నౌక.

ఆకాశంలో అక్కడక్కడ మిణుకు మిణుకుమంటున్న చుక్కలు అనంతమైన చీకటిధాటికి చిన్నబోతున్నాయి. దూరంగా కడలి కొలనులో జలక్రీడలాడుతున్న మత్తగజాల గుంపులా కన్పిస్తున్నాయి లక్షదీవులు.

ఇంజన్ రూమ్‌లోని గ్లాస్ ఫ్రేంలో బిగింపబడిన ప్రపంచపటాన్ని చూస్తూ ఆలోచిస్తున్నాడు కెప్టెన్ ఆల్లీ. ఆ పటంలో వివిధ దేశాల మధ్య సాగే సముద్ర మార్గాలు, వాటి దూరాలతో సహా ముద్రింపబడి వున్నాయి.

బొంబాయి నుండి ఆఫ్రికా దక్షిణ అగ్రమైన కేప్ టౌన్‌కు 4604 మైళ్ళు. కేప్ టౌన్ నుండి లండన్‌కు 6117 మైళ్ళు. కలసి మొత్తం 10721 మైళ్ళు ప్రయాణించాల్సి వుంటుంది.

బొంబాయి నుండి కేప్ టౌన్ వరకూ అరేబియా, హిందూ మహాసముద్రాలపైనా, కేప్ టౌన్ నుండి లండన్ వరకూ అట్లాంటిక్ మహాసముద్రంపైనా.... అలా మూడు సముద్రాలగుండా సాగుతుంది ఆ ప్రయాణం.

ఆ సముద్రాల ప్రవాహదిశలు, అంతర్వాహినుల స్థితిగతులనుబట్టి ఒక్కో సముద్రంపై ఎన్ని నాటికల్స్ వేగంతో (సముద్రయానంలో వేగాన్ని నాటికల్స్‌గా గణిస్తారు.) ప్రయాణం చేయవచ్చో అంచనా వేస్తున్నాడు అతడు.

అంతలో ఒక సెయిలర్ పరుగెత్తుకుంటూ ఆ గదిలోకి వచ్చాడు.

"సర్! ఓసారి అటు చూడండి!" అతని గొంతులో ఆందోళన!

ఆ సెయిలర్ చూపించిన దిశవంక చూసిన కెప్టెన్ ఉలిక్కిపడ్డాడు. "మైగాడ్!" అన్నాడతడు. అప్రయత్నంగా. ఇంజన్ రూమ్‌లోని సెయిలర్స్ అంతా ఆ వంకే చూస్తున్నారు. అక్కడ....సముద్రం మధ్య చీకటిని చీలుస్తూ ఎర్రని మంటలు నాలికలు చాస్తూ నింగిని అందుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి.

'ఏదో నౌక తగలబడిపోతూంది!" అనుకున్నారు వారంతా ఆందోళనగా.

నౌక వేగాన్ని తగ్గించమని ఇంజన్ కంట్రోలర్స్‌కు చెప్పి, ఆ గదిలోనుండి పరుగులాంటి నడకతో డెక్ పైకి చేరుకున్నాడు కెప్టెన్ ఆట్లీ. అతనితోపాటు ఆ రూమ్‌లోని మరికొద్ది సెయిలర్స్ కూడా.

త్రాటి నిచ్చెన ద్వారా బ్రిడ్జిపైకి చేరుకున్నారు. (షిప్‌లో పొడుగ్గా పిల్లర్‌లా వుండేదానిని బ్రిడ్జి అని వ్యవహరిస్తారు.) బ్రిడ్జిపై నున్న ఒక సెయిలర్ బైనాక్యులర్‌ను కెప్టెన్‌కు అందించాడు. వాటిద్వారా ఆ మంటలవంక చూశాడతడు.

'వారి అనుమానం నిజమే! ఆ తగలబడుతున్నది

నిజంగా ఒక నౌకే!'

మంటలు విరజిమ్ముతున్న ఆ నౌక డెక్ పై హడా వుడిగా పరుగెత్తుతున్నారు కొందరు వ్యక్తులు. బైనా క్యులర్ గుండా చూస్తున్న కెప్టెన్ కు వారు ధరించిన తెల్లని నేవెల్ దుస్తులు, తమ నౌక వంకే చూస్తూ, సహాయం కోరుతూ, వారు ఊపుతున్న తెల్లని జండాలూ స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్నాయి.

అతడు అలా చూస్తూనే ఆలోచించసాగాడు.

అంతర్జాతీయ సముద్రయాన నిబంధనల ప్రకారం ప్రమాదంలో వున్న ఏదైనా ఓడ సముద్రమధ్యంలో తారసిల్లినప్పుడు విధిగా దానిని, అందలి ప్రయాణీకులను రక్షించడానికి ప్రయత్నించాలి.

కాని, ఏ అన్యవిషయాలలోనూ తలదూర్చకుండా సూటిగా లండన్ వరకూ ప్రయాణం కొనసాగించమని తనకు తన పైఅధికారు లిచ్చిన ఉత్తరువు.

ఏం చేయాలి?

ఏదీ నిర్ణయించుకోలేక అతని మనసు ఊగిసలాడుతున్న క్షణంలో అతని కంటపడింది దగ్ధమౌతున్న ఆ నౌక తెర చాప స్తంభంపై రెపరెపలాడుతున్న జండా! దానిని చూస్తూనే ఉలిక్కిపడ్డా డతడు.

అది బ్రిటిష్ జాతీయ పతాకం!

ఆపదలో నున్నది తమ దేశపు నౌకని అర్థమయ్యాక, యిక తాత్సారం చేయలేదతను. తక్షణం దగ్ధమౌతున్న ఆ నౌక దిశగా తమ ఓడను నడపమని ఆజ్ఞలు జారీ చేసాడు. మరికొద్ది నిముషాలలో షార్ప్ గా టర్న్ అయి, శరవేగంగా ఆ మంటలవైపు దూసుకుపోసాగింది షిప్ ఎలిజబెత్!

అయితే ఆ నిర్ణయం ఎంత ప్రమాదకరమైనదో అతనికి తెలియదు! తెలిసివుంటే ఎట్టి పరిస్థితులలోనూ తమ ఓడను ఆ దిక్కుగా నడపమని ఆజ్ఞాపించేవాడు కాదు!

3

మంటల్లో చిక్కుకున్న తమ నౌకవంకే చూసుకు వస్తున్న 'ఎలిజబెత్' వంక ఆనందంగా చూస్తున్నారు చౌహాన్, పండిట్.

కొద్ది క్షణాల్లో తమ ప్లాన్ సక్సెస్ కాబోతూందన్న ఎగ్జయిట్ మెంట్ వారిని వివశుల్ని చేస్తూంది. వారికి ఆ ముందురోజు రాత్రి శివాజీ పాటిల్ వివరించిన ప్లాన్ గుర్తుకు వచ్చింది—

"చాలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయబడ్డాయి ఆ పెట్టెకు. ఆ పెట్టెను ఓడలో చేర్చేముందు గాని, చేరిన తరువాతగాని ఆ పెట్టెను మామూలు పద్ధతుల్లో చేజిక్కించుకోవడం అసాధ్యమనే చెప్పాలి.

ఆ పెట్టెను పొందాలంటే ...

ఓడలోని మొత్తం సిబ్బంది యొక్క ఎటెన్షన్‌ను మరోవైపు డైవర్టు చేయగలగాలి. ఆ తరువాత కూడా ఆ షిప్ కెప్టెన్‌ను లొంగదీసుకోగలగాలి. ముందే చెప్పానుగా ఆ సౌండ్ కోడ్ గురించీ, ఆ డెన్ తాళం చెవి గురించీనూ!"

"ఇవన్నీ నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగారు వారిద్దరూ.

చిన్నగా నవ్వాడు పాటిల్.

"ఎలిజబెత్‌లో పని చేస్తున్న ఒక కళాసీ మన 'క్రాంతి' సంఘ సభ్యుడు."

క్రాంతి విప్లవ సంఘానికి వారు ముగ్గురూ మూల

స్తంభాల్లాంటి వారైనా, శరీరంగా పాటిల్ వారికి సాయకుడులాంటివాడు. తమ సంఘ సభ్యుల గురించి వారికికూడా తెలియని ఎన్నో రహస్య విషయాలు ఒక్క పాటిల్ కు మాత్రం తెలుసు.

వారు ఆశ్చర్యంతో తెల్లబోయారు. పాటిల్ మాత్రం నిర్వికారంగా చెప్పుకుపోతున్నాడు.

"ఇక వున్నది ఒకటే మార్గం! ఎలిజబెత్ ను ముక్కలు చేయాలి! అలా చేయగల్గితే....ముక్కలై మరికొద్ది సేపట్లో మునిగిపోబోతున్న ఎలిజబెత్ ను వీడి ప్రాణాలను రక్షించుకోవడానికి ప్రయత్నిస్తారు ఆ ఓడలోని సిబ్బంది. అదే సమయంలో సెయిలర్స్ దుస్తులు ధరించిన మనం ఆ శిథిలమైన ఓడలోనికి ప్రవేశించి ఆ పెట్టెను చేజిక్కించుకోవాలి!

"అయితే యిక్కడ సమస్య....ఆ షిప్ ను ఎలా బ్లాస్టు చేయాలన్నది! నౌకలను ధ్వంసంచేసే టార్పెడోలు మన దగ్గరలేవు. నిజమే! కాని ఏ టార్పెడోలు వినియోగించకుండానే ఎలిజబెత్ దానంతట అదే ముక్కలయ్యే ఉపాయం ఒక్కటే వుంది.

"ఆ ప్లాన్ సక్సెస్ కావాలంటే మనం అర్జెంటుగా ఒక నౌకను సంపాదించాలి. సామానులను చేరవేసే చిన్న నౌకైనా ఫర్వాలేదు!

"నేను దానికి ఒక ఉపాయంఆలోచించిపెట్టాను. ఈ రోజు రాత్రే బొంబాయి రేవునుండి లక్షదీవులకు బయలు దేరి వెళ్తుంది సరకులను తీసుకుపోయే చిన్న నౌక. లక్ష దీవులలోని బ్రిటిష్ పటాలానికి రేషన్ తీసుకుపోతున్నది ఆ నౌక.

"అందులో పెద్ద సిబ్బందేమీ వుండదు. ఇంజన్

రూమ్‌లో నుంచే ఇద్దరో, ముగ్గురో సెయిలర్స్ గాక సెక్యూరిటీ కోసం మరో ఇద్దరు సైనికులు. అంతే! వారిని ఏమార్చి ఆ నౌకను స్వాధీనం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదనుకొంటాను."

ఇంతలో చౌహాన్ మోచేత్తో మెల్లగా పొడవటంతో పండిట్ ఆలోచనలకు బ్రేక్ పడింది.

"ఏం పండిట్! ఈ పడవను ఎలా సంపాదించామో గుర్తుకు తెచ్చుకుంటున్నావా?" చిన్నగా నవ్వుతూ అన్నాడు చౌహాన్.

అవునన్నట్లు తలాడించి మళ్ళీ గతంలోకి జారుకున్నాడు పండిట్ —

ఆ రోజు రాత్రి....

బొంబాయి రేవు నుండి యింకొద్ది నిముషాలలో ఆ సరకుల నౌక బయలుదేరబోతున్నదనగా, ఆ పడవ సరంగును కలిసాడొక వృద్ధుడు.

చిన్న వెండి రూపాయల సంచిని ఆ సరంగు చేతిలో పెట్టి 'తమను లక్షదీవుల వరకూ తీసుకువెళ్ళమని' బ్రతిమాల సాగాడు. ఒక్కసారి మిగిలిన సిబ్బందివంక సాలోచనగా చూసి సరే నన్నాడు ఆ సరంగు.

అయితే వారు అంత త్వరగా అంగీకరించడానికి కారణం ఆ వృద్ధుడిచ్చిన రూపాయల సంచి కాదు. ఆ వృద్ధుని వెనుక తలపైకి ముసుగును లాక్కొని నిలుచున్న యువతి. ఆమెను చూసి అంగీకరించారు వారు.

అప్పటికే వారి మనసుల్లో ఒక పథకం రూపుదిద్దుకుంది. 'ఆ వృద్ధుడిని ఏ సారా మత్తులోనో ముంచేస్తే.... హాయిగా ఆ పిల్లను పంచుకోవచ్చు. ఆ పిల్ల ఔనన్నా, కాదన్నా, ఎదురుతిరిగినా సముద్ర మధ్యంలో ఆమె

చేయగలిగేది ఏముంది? తమ కౌగిళ్ళలో కరిగిపోవడం తప్ప!

'చల్లని సముద్రపుగాలిలో రమ్ బిగించాక, ప్రక్కలో పసందైన పిల్ల. వాహ్! ఏం రంజుగా వుంటుంది ఈసారి ప్రయాణం!'

వారు లొట్టలు వేసుకుంటూ ఆ యువతి వంక చూస్తున్నారు. తల వంచుకునే మెల్లగా ఆ పడవలోనికి ఎక్కింది ఆమె. ఓ మూల సామాన్ల ప్రక్కగా ఒదిగి కూర్చున్నారు ఆ వృద్ధుడూ ఆమె.

బద్ధకంగా కూత వేస్తూ ముందుకు కదిలింది ఆ నౌక. మేలి ముసుగును సవరించుకుంటూ నీలి సముద్రపు టలల వంక అబ్బురంగా చూస్తూం దామె.

పచ్చగా కన్పిస్తున్న ఆమె కాలిపిక్కలూ, ఎత్తయిన జఘనాన్ని బట్టి, మేలిముసుగుమాటున దాక్కున్న ఆమె మిగిలిన అందాలను అంచనా వేస్తున్నారు ఆ నౌకలోని సిబ్బందులు.

తమ ఎదురుగా కూర్చున్న వారితో .... "ఈ మధ్యే పెళ్ళయింది బాబూ అమ్మాయికి. అల్లుడు లక్షదీవుల్లో తోటల్లో కూలీ. అమ్మాయిని కొత్త కాపురానికి తీసుకు వెళ్తున్నాను" అన్నాడు ఆ వృద్ధుడు.

చిన్నగా నవ్వుతూ సిగ్గుతో, మొగ్గలా మరింత ముడుచుకుపోయింది ఆ యువతి.

సంధించి విడిచిన శరంలా నీటిపై రివ్వున దూసుకుపోతూంది ఆ నౌక. ఇంకాస్సేపట్లో ఆ పిల్ల పొందులో పొందబోయే సుఖాన్ని తలచుకుంటూ మరింత హుషారుగా పడవను నడుపుతున్నాడు సరంగు.

కాసేపు వృద్ధునితో కబుర్లు చెప్పాక, రమ్ సీసాలను

పైకి తీసారు వారు. ఒక పెద్ద గ్లాసు నిండా రమ్మును పోసి ఆ వృద్ధునికి అందించారు.

గ్లాసును పెదవుల దగ్గర పెట్టుకోబోతూ ఆ యువతి వంక సాలోచనగా చూసాడు ఆ వృద్ధుడు. వారికి అధోముఖంగా తిరిగి, కండువాను చాటుచేసుకొని త్రాగు తున్నట్లు నటిస్తూ, తెలివిగా ఆ మద్యాన్ని సముద్రం లోనికి ఒలకబోసాడు. అప్పటికే వారు ఒక్కొక్కరు రెండు, మూడు గ్లాసులు ఖాళీ చేసారు.

రమ్ గొంతు దిగేసరికి, మెల్లగా వారి శరీరాలు వేడెక్కసాగాయి. రగులుకొన్న కోరికతో వారి కళ్ళు ఎర్రబడ్డాయి. చిన్నగా త్రూలుతూ, సన్నగా ప్రేలుతూ, వెకిలి నవ్వులు నవ్వుతూ, ఆమెవంక ఆకలిగా చూడ సాగారు వారు. పరిస్థితి చేయిదాటబోతున్నదని గ్రహిం చాడు ఆ వృద్ధుడు.

ఆమె వంక చూసి కన్ను గీటుతూ "అమ్మాయీ! బాబుగార్లకు తలా కాస్త మిఠాయి పంచరాదూ!" అన్నాడు కాలి దగ్గరున్న వెదురుబుట్టను ఆమెవైపు తోస్తూ.

ఆమె మూతను తెరచి దోసెడు దూద్ పేడాలను పైకి తీసింది. మెల్లగా లేచి, అడుగులు వేస్తూ తలా ఒక దూద్ పేడాను వారికి అందించింది. వయ్యారంగా నడుస్తూ, సిగ్గుతో వగలుపోతూ, చేతివ్రేళ్ళ కొసలను సుతారంగా తాకిస్తూ ఆమె అందించిన మిఠాయిలను ఆనందంగా నోట పెట్టుకున్నారు వారంతా.

అంతే! మరో రెండు నిముషాల్లో మైకం వచ్చినట్లు తూగుతూ, స్పృహతప్పి దబ్బున క్రిందకు పడిపోయారు' మరుక్షణం ఒక్క గెంతులో ఇంజన్ రూమ్‌లోకి ప్రవేశించి'

మొద్దులా తెలివితప్పి పడివున్న పరంగును ప్రక్కకు లాగి, అతని స్థానాన్ని ఆక్రమించాడు ఆ వృద్ధుడు.

మేలిముసుగును విసరేసి వంటిపై నున్న లంగానూ, చోళీని చక చకా విప్పటం ప్రారంభించింది ఆ యువతి. అంతవరకూ మరో పెద్ద వెదురుబుట్టలో ముడుచుకు కూర్చున్న పండిట్ మెల్లగా పైకి లేచాడు. అతని తలపై నుండి జల జలా క్రిందకు రాలాయి ఆ బుట్టలోని సీమ రేగుపళ్ళు.

"అయ్యో! గుడ్డలన్నీ విప్పేయకు చౌహాన్! నీ నగ్న సౌందర్యాన్ని చూడలేక ఈసారి నేను మూర్ఛ పోవాలి!" అల్లరిగా నవ్వుతూ అన్నాడు పండిట్.

తలకు పెట్టుకున్న విగ్గును ఊడదీస్తున్న చౌహాన్ చిన్నగా నవ్వాడు.

అప్పటికే పెట్టుడు మీసాలనూ, గడ్డాలను ఊడదీసి, చొక్కాను విప్పదీస్తున్నాడు అంతవరకూ వృద్ధునిలా నటించిన శివాజీపాటిల్.

తెలివితప్పి పడివున్న సెయిలర్స్ యొక్క దుస్తులను విప్పదీసి ధరించారు ఆ ముగ్గురూ. ఆ నౌకలోని సిబ్బంది నందరినీ ఒక లైఫ్‌బోటులోకి చేర్చారు.

"తెలివితప్పిన వారిని వీరులయిన హిందువులు చంపరు కాబట్టి, మిమ్మల్ని ప్రాణాలతో విడిచిపెడుతున్నాం.

గుడ్ బై జంటిల్మన్!

తెలివి వచ్చాక మీ పాట్లేవో మీరు పడండి!" అని మనసులో అనుకుంటూ ఆ లైఫ్‌బోటును సముద్రంలోకి విడచిపెట్టాడు పాటిల్.

మరికొద్ది నిముషాల్లో శివాజీ సారధ్యంలో ఆ నౌక సముద్రజలాలపై సాగుకుపోవటం ప్రారంభించింది. కొన్ని

గంటలసేపు నిర్విరామంగా ప్రయాణం సాగించాక, ఆ నౌక లక్షదీవుల సమీపానికి వచ్చింది.

అయితే ఆ నౌకను లక్షదీవులవైపు నడుపలేదు శివాజీ. లక్షదీవులు మరో మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలో వున్నాయనగా ఆ నౌకను పశ్చిమానికి త్రిప్పి, సూటిగా ముందుకు పోనిచ్చి, లక్షదీవులను దాటాక, మళ్ళీ అర్ధచంద్రాకారంలో మలుపు త్రిప్పి తూర్పు దిక్కుగా పోనిచ్చాడు.

అరేబియా సముద్రంలో నున్న అందోత్ దీవి గురించి చాలా కొద్దిమందికి తెలుసు. లక్షదీవులకు, మినీకాయ్ దీవులకు మధ్య, కేరళలోని పాల్గాట్ పట్టణానికి సరిగ్గా పశ్చిమదిశలో సుమారు 250 కిలోమీటర్ల దూరంలో వుంది ఆ చిన్నదీవి. ఆర్థికంగా గాని, నాగరికంగా గాని యే మాత్రం కూడా అభివృద్ధికి నోచుకోని దీవి అది.

ఆ దీవిని గూర్చి విన్న నావికులెవరూ తమ నౌకలను ఆ దీవి ఛాయలకు కూడా పోనివ్వడానికి సాహసించరు. అలాంటి అందోత్ దీవివైపు సూటిగా తమ నౌకను పోనిచ్చాడు శివాజీ.

4

స్పీడోమీటర్‌ను చూస్తోన్న ఇంజన్ కంట్రోలర్ వులిక్కిపడ్డాడు.

తాను ఫిక్స్ చేసిన వేగంకన్నా యెక్కువ వేగాన్ని చూపిస్తోందది. ఆశ్చర్యంగా అద్దాలగుండా బయటకు చూశాడు. అసాధ్యమైన వేగంతో దూసుకుపోతూంది తమ నౌక ఎలిజబెత్.

తను పెంచకుండానే ఒక్కసారిగా అంత వేగం ఎలా పెరిగిందో అర్థంగాక తెల్లబోయాడతడు. స్పీడోమీటర్లో

ప్రమాదస్థాయిని సూచించే రెడ్ డాట్ పై అసహనంగా కనిపిస్తూంది వేగాన్ని సూచించే సూచిక.

ఛటుక్కున లీవర్ను వెనక్కు తిప్పి, వేగాన్ని తగ్గించ డానికి ప్రయత్నించాడతడు.

కాని, ఆశ్చర్యం!

వేగం ఏ మాత్రం తగ్గలేదు. అతడు మరోసారి ప్రయ త్నించాడు. ఇంజన్ ఆపేశాడు. కాని, ఫలితం లేక పోయింది.

మరోసారి....మరోసారి....

అలా అయిదారుసార్లు ప్రయత్నించాక అర్థం అయి పోయింది అతనికి, నౌకను అదుపుచేయటం తన చేయి దాటిపోయిందని!

కాని, ఆ పరిస్థితి యెలా సంభవించిందో అర్థంకాలేదు అతనికి. టెన్షన్తో అతని నుదుట చెమటలు పట్టాయి. నిస్సహాయంగా బయటకు చూశాడతడు.

మంటల్లో చిక్కుకున్న నౌకను దాదాపుగా సమీపిం చింది ఎలిజబెత్. మంటల్లో చిక్కుకున్నది ఓడ కాదు పెద్ద సైజు పడవ.

ఆ పడవ వెనుక, ఆ మంటల వెలుగులో స్పష్టా స్పష్టంగా వల్లని జీబూతంలా కన్పిస్తున్న ఎత్తయిన ప్రదేశంవంక కంగారుగా చూశాడతడు. నీటిలో నుండి బయటకు పొడుచుకొనివచ్చి, వల్లగా, సున్నగా, బోలుగా మెరుస్తోన్న వెనుశిలలను చూసేసరికి భయంతో కంపించి పోయాడతడు.

తన ప్రమేయం లేకుండానే తన నౌక ఒక్కసారిగా అంత వేగాన్ని యెందుకు పుంజుకుందో అప్పుడు అర్థం అయిందతనికి.

"మైగాడ్! అంటే....అంటే....ఆ కనిపిస్తున్నది అండోత్ దీవా!" ఆ ఆలోచన తట్టిన మరుక్షణం చిగురుటాకులా వణికిపోయాడతడు. భయంతో కీచుగా అరుస్తూ డెక్ పైకి పరుగెత్తాడు.

అప్పటికే బైనాక్యులర్ ద్వారా ఆ శిలలను చూసిన కెప్టెన్ అట్లీ కంగారుగా బ్రిడ్జ్ నుండి క్రిందకు దిగి డెక్ పైకి వచ్చాడు.

"కెప్టెన్! ఆ ఆ....అండోత్ దీవి!" వెర్రివాడిలా బొంగురు గొంతుతో గట్టిగా అరుస్తూ ఆ శిలలవైపు చూపించాడు ఇంజన్ కంట్రోలర్.

అంతే! ఎవరో ఛెర్నాకోలతో ఛెళ్లున ముఖంమీద చర్చినట్లయింది కెప్టెన్ కు. నల్లగా మాడిపోయింది అతని ముఖం.

"అంటే....అంటే ఆ కన్పిస్తున్నవి అయస్కాంత శిలలా!" గొంతులో తడి ఆరిపోతుంటే చిన్నగా గొణుక్కున్నాడతడు.

ఇనుమును ఆకర్షించడం అయస్కాంత లక్షణం! ఆ అయస్కాంత లక్షణాలను కలిగివుండే శిలలను అయిస్కాంత శిలలని పిలుస్తారు.

ఓరోలజీ (పర్వత శాస్త్రం)లో అయిస్కాంత శిలల గూర్చి యెప్పుడో విద్యార్థి దశలో చదువుకున్న విషయాలు గుర్తుకు వచ్చాయి అతనికి.

భూమి స్వయంగా ఓ పెద్ద అయిస్కాంతం. ఇనుప లోహాణువులు యెక్కువ శాతం వుండే కొన్ని అగ్నిశిలలు (Igneous Rocks) భూమియొక్క అయిస్కాంత క్షేత్ర పరిధిలో ప్రభావితమవటంచేత ఆ శిలలలో కూడా ఆ అయస్కాంత లక్షణాలు యేర్పడతాయి.

అగ్నిపర్వతాల విస్ఫోటనంలో ఉబికిన లావా ఘనీభ
వించటంచేత యేర్పడ్డ శిలలను అగ్నిశిలలని వ్యవహరి
స్తారు. లోహామ్ల జనితములైన (Iron Oxide-Fe_3O_4)
అట్టి అయిస్కాంత శిలలు యెక్కువగా నిక్షిప్తమై
వున్నది ఉత్తర స్వీడన్‌లో.

ఇనుముతో చేయబడ్డ ఓడలలాంటివి ఆ శిలల అయి
స్కాంత క్షేత్ర పరిధిలోకి చేరబడినపుడు, వాటిచే ఆక
ర్షింపబడి, ఇనుమడించిన వేగంతో వాటిని ఢీకొనడం
జరుగుతుంది.

అలాంటి శిలలకు ఆలవాలం కావటంచేతే అందోళ్
దీవి గూర్చి తెలిసిన నావికులెవ్వరూ ఆ దీవి దరిదాపుల
చేరటానికి కూడా సాహసించరు.

"హా! ఇంకొద్ది క్షణాలలో తమ ఓడ కూడా ఆ
అయిస్కాంత శిలలకు ఢీకొని ముక్కలు కాబోతుందా?"
యిక ఆపైన ఆలోచించే శక్తిలేక అసహనంగా తల విది
ల్చాడు కెప్టెన్ అట్లీ.

"హారియప్! హారియప్ ఎవ్రిబడీ! లైఫ్‌బోట్లను నీళ్ళ
లోకి వదలండి, వాటిలోకి దూకి మీ ప్రాణాలను
రక్షించుకోండి!" గట్టిగా అరిచాడతడు.

అంతే!

ప్రాణభయంతో పిచ్చివాళ్ళలా డెక్‌పై అటూ ఇటూ
పరుగులు ప్రారంభించారు ఆ షిప్‌లోని సిబ్బంది. అదుపు
తప్పిన వేగంతో తమ ఓడ ఆ శిలలవైపు దూసుకుపోతు
న్నప్పుడే వారిలో చాలామందికి అనుమానం వచ్చింది....
ఏదో ఉపద్రవం జరుగబోతోందని.

ఇక షిప్ కెప్టెన్ యెప్పుడయితే డేంజర్ వార్నింగ్

యిచ్చాడో....ఆ క్షణమే హాహాకారాలతో ఆ ఓడ మాత్మోగిపోయింది.

5

శివాజీ, చౌహాన్, పండిట్‌లు ఉత్కంఠతో యెదురు చూస్తోన్నారు. 'ఇక కొద్ది క్షణాలలో తమ ప్లాన్ ఫలించి, అమూల్యమైన ఆ సంపద తమ స్వంతం కాబో తుందన్న ఆనందం' వారిని విలాసుల్ని చేస్తోంది.

చేజిక్కించుకున్న ఆ సరకుల నౌకను అండోల్ దీవి తీరానికి చేర్చి, సరిగ్గా షిప్ ఎలిజబెత్ సముద్రంలో దృగ్గోచరమైన వెంటనే, ఆ సరకుల నౌకను పెట్రోల్ పోసి ముట్టించారు వారు.

ఆ నౌక ఇనుపరేకులతో గాకుండా, చెక్కలతో చేయ బడటంచేత, ఆ అయస్కాంత శిలలవలన ప్రమాదానికి గురికాలేదు.

మంటల్లో చిక్కుకున్న తమ పడవను, దానిపై ఎగురు తున్న బ్రిటిష్ జాతీయపతాకాన్ని చూసి, తమ పడవను రక్షించడానికి ఎలిజబెత్ తమ నౌకను గ్రుడ్డిగా సమీపి స్తోందనీ, ఆ అయస్కాంత శిలల ఆకర్షణా వలయంలో చిక్కుకుంటుందనీ వారికి తెలుసు.

శివాజీపాటిల్ రచించిన అద్భుతమయిన వ్యూహం అది!

వారు చూస్తూండగానే రివ్వున దూసుకువచ్చి ఆ అయ స్కాంత శిలలను ఢీకొంది షిప్ ఎలిజబెత్. ఒక భయం కర విస్ఫోటనం! తాడి ఎత్తున లేచిన సముద్రజలాల మధ్య రగిలిన బడబాగ్నిలా ఆ శిధిల నౌకలో లేచిన మంటలు! ముక్కలు, చెక్కలుగా ఫెళ ఫెళ మంటూ విరిగిపోయింది ఆ నౌక.

ఉవ్వెత్తున లేచిన సముద్రజలాలతో పోటీపడుతూ, ఛిద్రమైన శకలాలు నింగికి ఎగిసాయి. మిన్నుముట్టిన హాహాకారాలు, ఆర్తనాదాలు ఆ సముద్రపు ఘోషలో కలిసిపోయాయి.

ఏ క్షణమయితే షిప్ ఎలిజబెత్ అయస్కాంత శిలలను ఢీకొని ధ్వంసమయిందో ఆ మరుక్షణమే సముద్రంలోకి దూకి, వేగంగా ఈదుకుంటూ శిథిలమైన ఎలిజబెత్‌ను చేరుకున్నారు శివాజీ, చౌహాన్, పండిట్‌లు.

సముద్రంలో విడువబడ్డ లైఫ్‌బోట్లను చేరుకోవడానికి డెస్పరేట్‌గా ప్రయత్నిస్తున్నారు. అప్పటికే డెక్‌పై నుండి క్రిందకు దూకిన కొందరు సెయిలర్లు విరిగిన శకలాల మధ్య పడివున్న ఒకరిద్దరు గాయాలతో కదలలేని స్థితిలో నిస్సహాయంగా మూల్గుతున్నారు. షిప్ శిలలను ఢీకొన్న క్షణంలో ఆ అదాటుకు తృళ్ళి రాళ్ళపై పడి, తలలు బద్దలయి ప్రాణాలనే కోల్పోయారు ఇద్దరో, ముగ్గురో సెయిలర్లు.

అత్యంత బీభత్సకరమైన దృశ్యమది!

చివరి సెయిలర్ కూడా క్రిందకు దూకేశాడని నిశ్చయించుకున్నాక, తను కూడా నీళ్ళలో దూకడానికి డెక్ చివరకు వచ్చాడు కెప్టెన్ ఆట్లీ.

షిప్ యేదైనా ప్రమాదానికి గురైనపుడు, ఆ షిప్ చివరి వ్యక్తి కూడా ఆ షిప్‌ను విడిచాక, ఆ షిప్‌ను రక్షించడం అసాధ్యమని ధృవపరచుకున్నాక మాత్రమే ఆ షిప్ కెప్టెన్ ఆ షిప్‌ను విడచిపెట్టాలి.

హి షుడ్ బి ద లాస్టు మేన్ టు గెట్ అవుట్ ఆఫ్ ద షిప్!

డెక్ రెయిలింగ్స్‌పై కాలు వేయబోతూండగా

గుర్తుకు వచ్చింది అతనికి కార్గో డెక్‌లోని పెట్టె విషయం! ఒక్క క్షణంసేపు కలవరంతో కంపించిపోయాడు. అతడు అంతగా కలవరపడింది అమూల్యమైన ఆ సంపదకోసం కాదు. ఆ పెట్టెకు కాపలాగా ఆ డెక్‌లో నియమింపబడ్డ గార్డ్స్ గురించి.

అతడు గిరుక్కున వెనుతిరిగి ఆ డెక్ వైపు పరుగుతీశాడు. సరిగ్గా అతడు ఆ డెక్ తలుపును సమీపించేసరికి.... ముగ్గురు సెయిలర్స్ ఆ తలుపుచుట్టూ చేరి, మోకాళ్ళపై వంగి కూర్చొని ఆ తలుపును తెరవడానికి ప్రయత్నిస్తున్నారు.

'అంత ప్రమాదకరస్థితిలో కూడా తమతోటి సెయిలర్స్ ప్రాణాలను రక్షించడానికి ప్రయత్నిస్తున్న ఆ సెయిలర్స్' ఎవరా అని వారివంక ఆశ్చర్యంగా చూస్తూ....

కోటు జేబులోనుండి ఆ తలుపుకు వేయబడ్డ తాళం చెవిని వారివైపు విసురుతూ—

"వెల్ డన్ బోయిస్! ఇదిగో దాని బీగం! దానితో ఆ తాళాన్ని తెరవండి. కమాన్ క్విక్!" అన్నాడు వారివంక మెచ్చుకోలుగా చూస్తూ.

మెల్లగా ఆ తాళాన్ని అందుకున్నాడు వారిలో ఒకడు. అతడిని చూస్తూ ఉలిక్కిపడ్డాడు కెప్టెన్. అదే క్షణంలో మిగిలిన ఇద్దరి ముఖాలు కూడా అతని కంట పడ్డాయి. ఆశ్చర్యంతో అతని కళ్ళు పెద్దవయ్యాయి.

'వాళ్ళు ముగ్గురూ తమ షిప్ ఎలిజబెత్‌లోని సెయిలర్స్ కాదు. బ్రిటిష్ నేవల్ యూనిఫారమ్స్ ధరించటంవలన వారూ తమ షిప్ సెయిలర్సే' అనుకొని పొరబడ్డాడు.

వారు ధరించిన దుస్తులనుబట్టి మంటల్లో చిక్కుకున్న ఆ నౌకకు సంబంధించిన సెయిలర్స్ అనుకుందామనుకుంటే.... వారు తమ షిప్‌లోకి ఎందుకు వచ్చినట్లు? యింకొద్దిసేపట్లో నీళ్ళలో మునిగిపోయే తమ షిప్ పైకి ఆశ్రయం కోరి వచ్చే వెర్రివాళ్ళుంటారా?

వచ్చినవారు సూటిగా ఆ కార్గో డెక్ తలుపును తెరవడానికి యెందుకు ప్రయత్నిస్తున్నారు?

ఆ డెక్‌లో యేముందో వారికి తెలుసునా? అంటే ఆ పెట్టె కోసమేనా వారు వచ్చింది?'

—ఆ ఆలోచన రాగానే కఠినంగా మారిపోయింది అతని ముఖం.

"ఎవరు మీరు?" అన్నాడతడు కటువుగా.

వారు సమాధానం చెప్పలేదు. బీగం అందుకున్న వ్యక్తి తల యొత్తకుండా తాళాన్ని తెరవడంలో మునిగిపోయాడు. మిగిలిన యిద్దరూ మాత్రం మెల్లగా లేచి నిలబడ్డారు.

"హేయ్! మిమ్మల్నే! యేం చేస్తున్నారు? ఇక్కడ మీకేం పని?"—నడుముకున్న బెల్టుకు వ్రేలాడుతున్న రివాల్వర్ పై చేయి వేస్తూ అన్నాడు కెప్టెన్.

అంతే!

ఈసారి వారివద్ద నుండి జవాబు వచ్చింది. మాటలతో కాదు! చేతలతో!

మెరుపు వేగంతో పైకి లేచి, కెప్టెన్ చేతిని తాకింది ఒక వ్యక్తి కాలు. అదే క్షణంలో అరచేతిని కత్తిలా బిగించి కెప్టెన్ కంఠంపై కొట్టాడు రెండవ వ్యక్తి. రెండడుగులు వెనక్కు తూలాడు కెప్టెన్. కరెంట్ షాక్

కొట్టినట్లు బాధతో విలవిల లాడిపోయాడు.

అయితే, అది రెండుక్షణాలు మాత్రమే!

తేప్పరిల్లిన మరుక్షణం మరో అడుగు వెనక్కు వేశాడు. చటుక్కున రివాల్వర్‌ను పైకితీసి వారికి గురి పెట్టాడు.

పిడికిళ్ళు బిగించి అతనిపైకి దూకబోతున్న ఆ యిద్దరు వ్యక్తులూ శిలావిగ్రహాల్లా నిలుచుండిపోయారు. ఊహించని ఆ పరిణామానికి వెల వెల బోయాయి వారి ముఖాలు.

6

"కమాన్! ఓపెన్ ద డోర్!" కఠినస్వరంతో ఆజ్ఞాపించాడు కెప్టెన్.

విరిగిన షిప్ బాడీగుండా షిప్‌లోనికి నీళ్ళు రావటం వలన, అప్పటికే మెల్ల మెల్లగా నీళ్ళలో మునిగిపోతూంది ఎలిజబెత్.

తాళం తీస్తున్న మూడవ వ్యక్తి ఓరకంటతో పరిస్థితిని గమనించాడు. అతని మెదడులో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

డెన్ తలుపులు తెరిచిన మరుక్షణం అందులోని గార్డ్సు పైకి వస్తారు. కెప్టెన్ ఆజ్ఞపై తమను బంధీలను చేస్తారు. అప్పుడు యింతటి తమ బృహత్ ప్రయత్నం వృథా అవుతుంది.

ఏం చేయాలి?

ఆలోచిస్తూ కూర్చుంటే, మరికొద్ది నిముషాల్లో షిప్ నీళ్ళలో మునిగిపోతుంది. అప్పుడు శాశ్వతంగా ఆ పెట్టె తమ చేజారి పోయినట్లే!

ఈలోగానే యేదో ఒకటి చేయాలి!

బట్ వాట్?

—ఏం చేయటమో నిర్ణయించుకోలేక, వణుకుతున్న చేతులతో బీగాన్ని తాళం రంధ్రంలో పెట్టి, బీగాన్ని తిప్పకుండా తాత్సారం చేస్తున్నాడు.

"ఊఁ....క్విక్!" అసహనంగా అరిచాడు కెప్టెన్.

చేసేదిలేక బీగాన్ని చిన్నగా తిప్పాడు. "క్లిక్" మంటూ తెరుచుకుంది ఆ తాళం. గొళ్ళెంనుండి తాళాన్ని ఊడదీసాడతడు.

"తలుపును తెరు!" గర్జించాడు కెప్టెన్.

మ్లానమైన ముఖాలతో నిస్సహాయంగా చూస్తోన్నారు నిలుచున్న ఆ ఇద్దరు వ్యక్తులు.

"ఊఁ! క్విక్!" మరోసారి గద్దించాడు కెప్టెన్.

అంతలో....

నీళ్ళలో మెల్లగా మునుగుతున్న షిప్ యేదో శిల తాకడంవలన చిన్నగా ఊగింది. ప్రక్కకు తూస్తా లోగారు ఆ డెక్ పై మిగిలిన ఆ నలుగురూ. ఒక్కక్షణం పాటు కెప్టెన్ ఏకాగ్రత చెదిరింది.

తలుపును తెరవబోతున్న అతడు ఆ క్షణాన్ని సద్వినియోగపరచుకున్నాడు. చేతిలోని తాళంకప్పను బలంగా కెప్టెన్ చేతిపైకి గురిచేసి విసిరాడు.

బాధగా అరుస్తూ చేతిలోని రివాల్వర్ ను క్రిందకు జారవిడిచాడు కెప్టెన్. అంతే! ఆ రివాల్వర్ చేజారిన మరుక్షణం, బోనులో నుండి విడివడ్డ సింహాల్లా అతనిపై లంఘించారు మిగిలిన ఇద్దరు వ్యక్తులూ.

ఒక పిడికిలిపోటు గుండెలపై, మరొకటి దవడ ఎముక క్రిందుగా, యింకొకటి ప్రక్కటెముకలపై ఇంకో పంచ్

నాభి క్రింద. అంతే! బాధగా అరుస్తూ గింగిరాలు తిరుగుతూ క్రిందపడ్డాడు కెప్టెన్.

ఒకడు వంగి క్రిందపడ్డ రివాల్వర్‌ను చేతిలోకి తీసుకున్నాడు. మరొకడు జేబులో నుండి పెన్ నైఫ్‌ను తీసి ఛటుక్కున కెప్టెన్ పైకి వంగాడు.

"నో! వద్దు చౌహాన్! చంపవద్దు!" అంటూ కంగారుగా అరిచాడు తలుపువద్ద కూర్చున్న శివాజీ.

కాని, అప్పటికే చౌహాన్ చేతిలోని కత్తి కెప్టెన్ గుండెల్లో దిగబడింది. శివాజీ వేసిన కేక వినిపించేసరికి మరో పోటు కంఠనాళాలపై....

చిన్నగా మూల్గుతూ తల వాల్చేశాడు కెప్టెన్ అట్లీ. ఆత్రంగా పరుగెత్తుకు వచ్చిన శివాజీ బాధగా తల విదిలించాడు.

"చౌహాన్! అనవసర రక్తపాతం నా కిష్టం వుండదని నీకు తెల్సుగా! మరి కెప్టెన్‌ను యెందుకు చంపావ్?" అసహనంగా అన్నాడు శివాజీ.

తప్పు చేసినట్లు తల దించుకున్నాడు చౌహాన్. "అతన్ని చంపకుంటే పరిస్థితి చేయిదాటి పోతుందేమోనని...." సన్నగా గొణిగాడు.

"తప్పొప్పులను ఎన్నుకుంటూ కూర్చుంటే నిజంగానే పరిస్థితి మనచేయి దాటిపోతుంది." అన్నాడు పండిట్ వారి మధ్య జోక్యం చేసుకుంటూ.

నిజమే! అప్పటికే మరింతగా మునిగిపోయింది షిప్. నీళ్ళు దాదాపుగా డెక్ అంచులను తాకుతున్నాయి.

ఒక్క పరుగున తలుపును సమీపించి ఆత్రంగా దానిని తెరిచాడు శివాజీ.

లోపల.... డెన్ లో....

ఏం జరిగిందో అర్థంగాక తల్లడిల్లిపోతున్నారు లోప లున్న గార్డ్స్.

మొత్తం ఓడంతా పూర్తిగా చితికిపోయినా, ఓడ అడుగుభాగాన ఉండటంచేత, ఉక్కుతో పెట్టెలా నిర్మింపబడటంచేత ఆ డెన్ మాత్రం చెక్కుచెదరలేదు. కాకుంటే, అయస్కాంత శిలలను ఆ ఓడ ఢీకొన్న తాకిడికి, ఆ డెన్ లోని గార్డ్స్ పల్టీలుకొట్టి, తల్లక్రిందులుగాపడి మోచేతులూ మోకాళ్ళూ కొట్టుకుపోయాయి. ఒకరిద్దరు గార్డ్స్ విసురుగా డెన్ గోడలకు గుద్దుకోవటం వలన స్వల్పమైన గాయాలయ్యాయి. అంతే!

ఏదో ప్రమాదం వాటిల్లిందని ఊహించారువారు. కాని లాకర్ లో బంధింపబడినట్లు ఆ డెన్ లో చిక్కుపడి పోయారువారు. బయటవారు తలుపును తెరిస్తేతప్ప, వెలుపలికి రాలేని పరిస్థితి.

ఏమయిందో, ఏమిటో తెలియక, కాలుగాలిన పిల్లుల్లా అసహనంగా అటూ, ఇటూ పచార్లు చేస్తున్నారు కొందరు గార్డ్స్. చెక్కమెట్లగుండా పైకిఎక్కి, తలుపును గట్టిగా మోదుతున్నారు మరో ఇద్దరు గార్డ్స్.

సరిగ్గా ఆ సమయంలో ఫటాలున తెరచుకుంది ఆ డెన్ తలుపు. అంతవరకూ తలుపును మోదిన గార్డు.... తలుపును తెరిచిన శివాజీ బృందాన్ని చూసి...."ఏం జరిగింది" అంటూ ఆత్రంగా ప్రశ్నించాడు.

బ్రిటిష్ నేవెల్ యూనిఫారమ్స్ లోనున్న వారిని తమ షిప్ కు సంబంధించిన సెయిలర్సే అనుకున్నాడతడు.

"ప్రమాదం సంభవించింది!

అండోత్ దీవి తీరంలోని అయస్కాంత శిలలను ఢీకొంది మన ఓడ."—ఎక్కడలేని ఆందోళననూ గొంతులోనికి తెచ్చుకొని చెబుతున్నాడు శివాజీ.

అతని మాటలు పూర్తికాకుండానే ఒక్క గొంతులో ద్వారంనుండి బయటకువచ్చి డెక్ పైకి చేరుకున్నాడు ఆ గార్డు, అమితమైన కంగారుతో.

శిధిలమై, సముద్రంలో కృంగిపోతున్న తమ నౌకనూ, డెక్ అంచులను ఢీకొంటున్న సముద్రపుటలలను చూసేసరికి మతిపోయిందతనికి.

షాక్ తిన్నవానిలా నిశ్చేష్టుడైపోయాడు.

తెప్పరిల్లిన మరుక్షణం భయంతో కీచుగా అరుస్తూ... తెరవబడ్డ తలుపుగుండా లోనికి తలపెట్టి....

"కమాన్ ఎవ్రీబడీ! హ్యారియట్ ఇంకొద్ది క్షణాలలో మనషిప్ సముద్రంలో మునిగిపోబోతూంది. పారిపోండి! పారిపోయి ప్రాణాలను రక్షించుకోండి!"

అతని అరుపులు తుపాకీ తూటాల్లా పనిచేసాయి. ప్రాణభయంతో పిచ్చిగా అరుస్తూ, ఒకరినొకరు తోసుకుంటూ ద్వారంగుండా బయటకు వచ్చారు ఆ డెక్‌లోని గార్డ్స్. బయటపడ్డ మరుక్షణం డెక్ పైకి పరుగులుతీసారు.

కూతవేటు దూరంలో సముద్ర జలాలపై తేలుతున్న లైఫ్‌బోట్లలో కన్పిస్తున్న తమ తోటి సెయిలర్స్‌వంక గట్టిగా అరుస్తూ....ఒక్కరొక్కరుగా సముద్రంలోనికి దూకసాగారు వారు.

వారిని చూస్తూ, తేలిగ్గా నిట్టూర్చి ఒక్కరొక్కరుగా ఆ డెక్‌లోనికి దిగారు - శివాజీ, చౌహాన్, పండిట్‌లు.

ఆ దేక్షణంలో.... పెట్రోల్ టాంక్ అంటుకోవడంతో బాంబ్ షెల్ బ్రద్దలయినట్లు ఫెటేలున ప్రేలిపోయింది

షిప్ ఎలిజబెత్. భయంకర విస్ఫోటనంతో ఫెళ, ఫెళ మంటూ నిలువుగా చీలిపోయింది ఆ షిప్.

ఆ తాకిడికి ఉక్కుతో చేయబడ్డ ఆదెన్ సైతం చిట్లి దానిమ్మపండులా విచ్చుకుంది. కట్టుతెగిన వరదలా ఉవ్వెత్తున ఆదెన్ ను ముంచెత్తాయి సముద్రపు నీళ్ళు.

8

ఏ అమూల్యమైన సంపదకోసం ఇన్ని శ్రమలనూ ఓర్చారో, దేనికోసం ప్రాణాలకు తెగించి మరీ ఇంత సాహసం చేసారో....ఆ అమూల్యసంపద నిక్షిప్తం చేయబడ్డ పెట్టె....దట్ రెడ్ బాక్స్....

సరిగ్గా వారికి నాలుగు అడుగుల దూరంలో ఉండనగా జరిగిందా ఉత్పాతం!

ఏదో రాక్షస హస్తం ఎత్తి కుదిపేసినట్లు వైల్డుగా ఊగింది ఆ దెన్. ఆ ఊపుకు ఒక్కొక్కరు ఒక్కొక్క దిక్కుకు తుళ్ళిపోయారు వారు.

ఎగిరి తలక్రిందులుగా పడటంలో చౌహాన్ తల సూటిగా నేలను తాకటంతో....ఆ క్షణమే స్పృహను కోల్పోయాడతడు. నేలపై బోర్లాపడటంతో పండిట్ ముక్కు చితికిపోయింది. పెదవులు చిట్లి రక్తం చిమ్మింది. మోచేతులు, మోకాళ్ళు కొట్టుకుపోయాయి.

విసురుగా దెన్ గోడకు గుద్దుకున్నాడు శివాజీ. ఫ్లాట్ గా వీపు గోడకు తగలడంచేత అతనికి పెద్ద దెబ్బలేం తగలలేదు. వెన్నుకాస్తా నొప్పిపెట్టసాగింది. అంతే!

వారు ఆ దిగ్భ్రమనుండి తేరుకోకుండానే, పగిలిన ఆదెన్ గోడలనుండి ఉబికి వస్తున్న సముద్రపు నీరు వారిని ముంచెత్త సాగింది.

ఆ షాక్ నుండి మొదటగా తేరుకున్నది శివాజీ. చల్లని సముద్రపునీరు శరీరానికి తగిలేసరికి, ఉలిక్కిపడుతూ కంగారుగా చుట్టూ చూసాడు.

శాస్త్రి దూరంలో బాధగా మూలుగుతూ మెల్లగా పైకిలేస్తున్నాడు పండిట్.

"పండిట్!"

నీటిని చూస్తూ కలవరపడుతున్న పండిట్ శివాజీ పిలుపు విని వెనుతిరిగి చూసాడు.

"కమాన్ పండిట్ క్విక్!" అంటూ పెట్టెవంక పరుగుతీశాడు శివాజీ. పండిట్ అతడిని అనుసరించాడు.

ఏమాత్రం తాత్సారం చేసినా ఆ పెట్టె తమ చేజారి పోతుందని, శాశ్వతంగా సాగర గర్భంలో కలిసి పోతుందనీ వారికి తెలుసు.

ఆత్రంగా ఆ పెట్టెను పైకెత్తారు. పెట్టెను మోసుకుంటూ మెట్లవైపు అడుగులు వేశారు.

అప్పటికే దాదాపు కాలి పిక్కలను దాటివచ్చేశాయి నీళ్ళు. నీళ్ళలో అడుగులు సరిగ్గా పడటంలేదు. ఆపైన ఆ పెట్టె బరువు.

మెల్లగా మెట్లమీదకు ఆ పెట్టెను చేర్చారు. అప్పుడు గుర్తుకు వచ్చింది. వారికి చౌహాన్ విషయం.

"మైగాడ్! చౌహాన్....చౌహాన్ ఏడీ!" ఇద్దరూ కూడ బల్కుకున్నట్లు ఒకేసారి అరిచారు చిన్నగా.

ఆత్రంగా చుట్టూ కలియజూసారు.

క్షణ. క్షణానికీ పెరుగుతున్న నీటిమట్టం తప్ప మరేమీ కనిపించటం లేదా డెన్‌లో.

"ఏమయ్యాడు? ఇంతలోనే ఎక్కడికి మాయమయ్యాడు?"....విపరీతమైన ఆందోళనతో చలించి

పోసాగారు వారు. ఒక్కక్షణం ఒకరివంక ఒకరు పాలోచనగా చూసుకున్నారు.

పెట్టెను ఎత్తి, మరో రెండుమెట్లపైన పెట్టి, క్రిందకు ఉరికారు వారు. అప్పటికే మోకాళ్ళదాకా పెరిగింది నీటిమట్టం.

'అక్కడే, ఎక్కడో నీళ్ళ అడుగున చౌహాన్ స్పృహతప్పి పడిఉంటాడని' వారి నమ్మకం! చెరో దిక్కులో నీళ్ళలో దేవులాడుతూ చౌహాన్ కోసం వెదుకసాగారు.

ఒకటి....రెండు....మూడు....

ఒక్కొక్కక్షణం గడుస్తున్నకొద్దీ వారిలో టెన్షన్ పెరిగిపోతూంది. ఆ డెన్ లోని ప్రతి అంగుళాన్ని గాలించారు. కాని,విచిత్రం....చౌహాన్ ఎక్కడాకన్పించలేదు.

'ఉన్నపాటున డెన్ లోఉన్న వ్యక్తి ఎలా అదృశ్యమయినట్లు?' ఆశ్చర్యంగా ఒకరినొకరి చూసుకున్నారు వారు.

వీరి ఆలోచనలతో ప్రమేయం లేనట్లు నీటిమట్టం క్షణక్షణానికి పెరిగిపోతూంది. తొడలను దాటి నడుం అంచులను తాకుతున్న నీటివంక ఆందోళనగా చూశారువారు.

మెల్లగా ఈదుకుంటూ చీలిన డెన్ గోడలను సమీపించారు. డెన్ కు ఏర్పరచిన పెద్ద తలుపులా నిలువుగా చీలిన ఆ ఖాళీగుండా సముద్రపునీరు పొంగి పొర్లివస్తూంది.

ఆ చీలికగుండా బయటకు చూశారువారు. ముక్కలయిన షిప్ బాడీకి, డెన్ గోడకూ మధ్య, నిండివున్న సముద్ర జలాలలో అస్పష్టంగా కన్పిస్తున్న ఆ భయానక దృశ్యాన్ని చూస్తూ నిశ్చేష్టులైపోయారు వారు.

భయంతో వారి గొంతులు ఆర్చుకుపోయాయి.

శరీరాలు సన్నగా కంపించాయి.

'ఓ' అంటూ చిన్నగా అరిచారువారు. ఆ బీభత్సాన్ని చూడలేక వారి ముఖాలు వివర్ణమయ్యాయి.

9

ఆ వారతో బొంబాయి రేవు గుప్పుమంది.

అండోత్ దీవి సమీపంలో షిప్ ఎలిజబెత్‌కు ఘోర ప్రమాదం సంభవించిందని తెలిసి, ఆందోళనతో వణికి పోయారు ఆ రేవులోని బ్రిటిష్ ఉన్నతాధికార్లు.

వారు ముఖ్యంగా ఆందోళన చెందుతున్నది. ముక్కలయిన ఆ షిప్ గురించిగానీ, సముద్రంపాలైన ఆ షిప్ సిబ్బంది గురించిగానీ కాదు. అమూల్యమైన ఆ సంపద కోసం. ఆ రెడ్ బాక్స్ కోసం.

'నిజమే ఆ బాక్స్ పోయిందంటే బ్రిటిష్ రాణికి ఏమని సంజాయిషీ యివ్వాలి?'—అదీ వారిని కలవర పరుస్తున్న ప్రశ్న!

బొంబాయి పోర్టుకు సంబంధించిన బ్రిటిష్ ఉన్నతాధికార్లతో ఒక రహస్య సమావేశం ఏర్పాటయింది. రెస్క్యూఅండ్ సెర్చింగ్ ఆపరేషన్స్ కోసం ఎనిమిది పెట్రోల్ బోట్స్ తక్షణమే అండోత్ దీవికి తరలింపబడ్డాయి.

ఒక్కొక్క బోటులోను పదిమంది సైనికులు పంపబడ్డారు. ప్రతి అరగంటకొకసారి, పరిస్థితినంతా బొంబాయి పోర్టుకు రిపోర్టు చేయాలని, వారికి ఆర్డర్స్ జారీ చేయబడ్డాయి.

సిగ్నలింగ్ రూమ్‌లో కూర్చుని ఆ బోట్స్‌నుండి వచ్చే మెసేజస్ కోసం అసహనంగా ఎదురుచూస్తున్నారు ఆ పోర్టు ఉన్నతాధికార్లు.

అయితే ఆ ఉన్నతాధికార్లకూ, సెర్చింగ్‌కు వెళ్తున్న సైనికులకూ అర్థంకాని విషయం ఒక్కటే!

'నిర్ణీతమార్గాన్ని వదలి, షిప్ ఎలిజబెత్ అండోత్ దీవివైపు ఎందుకు వెళ్ళినట్లు? అదీ....ఆ దీవి తీరాన అయస్కాంత శిలలున్నాయని తెలిసి కూడా!'

కొన్నిగంటల తరువాత ఆ పెట్రోల్ బోట్స్ అండోత్ దీవి సమీపానికి చేరుకున్నాయి.

సముద్రం మధ్యలో అంటే దీవి తీరంలోనున్న అయస్కాంత శిలల ఆకర్షణా పరిధికి అందనంత దూరంలో ఆ పెట్రోల్ బోట్స్ ఆపబడ్డాయి.

పది, పన్నెండు లైఫ్‌బోట్లను సముద్రంలోనికి దించి, వాటిపై సెర్చింగ్‌కు బయలుదేరారు ఆ పెట్రోల్ బోట్స్‌లోని సైనికులు.

వారు తీరాన్ని సమీపించేసరికి ఎలిజబెత్ పూర్తిగా నీళ్ళల్లో మునిగిపోయింది. కేవలం దాని బ్రిడ్జి పిల్లర్ మాత్రం నీళ్ళల్లోనుండి బయటకు కన్పిస్తూంది. బోట్లను నడుపుకుంటూ వారు ఆ షిప్‌ను సమీపించారు.

స్విమ్మింగ్ సూట్లను ధరించి, వాటర్‌గన్‌లను పట్టుకుని సిద్ధంగా ఉన్న దాదాపు ఇరవైమంది సైనికులు నీళ్ళలోనికి దుమికారు. చేపల్లా ఈదుకుంటూ విరిగి ముక్కలైన ఎలిజబెత్‌ను చుట్టుముట్టారు.

శిథిలమైన షిప్ బాడీ శకలాలను దాటి లోనికి ప్రవేశించారు. కాని, అక్కడ కన్పిస్తున్న బీభత్సకరమైన దృశ్యాన్ని చూశాక వారి అడుగులు ముందుకు పడలేదు.

భయంతో వారి ముఖాలు పాలిపోయాయి. వాటర్ గన్‌లను పట్టుకున్న వారి చేతులు సన్నగా వణకసాగాయి.

(ముగింపు వచ్చే సంచికలో)